

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.40 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 835.10 అడుగుల వద్ద ఉంది.



అమరేశ్వరుని ఆదాయం

అమరావతి: అమరేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు నిర్వహించగా, కార్తిక మాసంలో రూ.1.60 కోట్ల ఆదాయం లభించినట్టు ఈవో గోపీనాథశర్మ తెలిపారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

న్యూస్‌రీల్

అవగాహనతోనే సత్వర తీర్పులు



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి కృపాసాగర్, పక్కన జిల్లా జడ్జి పార్థసారథి

పట్నంబజారు: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఉమ్మడి జిల్లాల పరిధిలోని న్యాయమూర్తులకు రిలవెన్స్ ఆఫ్ ఫ్యాక్ట్స్ ఇన్ క్రిమినల్ కేసెస్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా ప్రధానన్యాయమూర్తి వై.వి.జి.వి.ఎస్.పార్థసారథి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాపునకు హైకోర్టు న్యాయమూర్తి వి.ఆర్.కె.కృపాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తి కృపాసాగర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క న్యాయమూర్తి నాణ్యమైన తీర్పు ఇచ్చేలా పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి సత్వర తీర్పులను ఇవ్వాలన్నారు. అనంతరం న్యాయవాదులు న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, న్యాయమూర్తి కృపాసాగర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా న్యాయస్థానాల న్యాయమూర్తులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ప్రోత్సాహకాలు

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా బలహీనమైన/వెనుకబడిన వర్గాల అభ్యర్థులు యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తుందని సోషల్ వెల్ఫేర్ డీడీ డి మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.50వేలు ఆర్థిక సాయం కింద నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. 2023లో నిర్వహించిన యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థుల నుంచి నగదు ప్రోత్సాహకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఇన్ పోర్టల్‌లో ఈనెల 19వ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి పది దరఖాస్తుల్లో తప్పుల సవరణ

బాపట్ల అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు తమ దరఖాస్తుల్లో తప్పులు దొర్లితే సరి చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుల ఎస్ఎస్‌సీ ఎగ్జామ్స్ లాగిన్‌లో ఈనెల 16 నుంచి 20వ తేదీలోపు విద్యార్థుల వివరాల సవరణకు సంబంధించి నమోదు చేయాలని చెప్పారు. విద్యార్థి తండ్రి, తల్లి పేర్లు, పుట్టిన తేదీ, మొదటి, రెండు లాంగ్వేజీల ఎంపిక, పరీక్షలు రాసే లాంగ్వేజీల ఎంపిక, డిజాబులిటీ, ఒకేషనల్ సబ్జెక్టులు, వాటి కోడ్స్, విద్యార్థుల మార్కుల ఐడెంటిఫికేషన్, విద్యార్థుల ఫొటో, సంతకం వంటి వివరాల్లో తప్పులు దొర్లితే సరి చేసుకునే వెలుసుబాటు ఉందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు.

నేటి నుంచి ధనుర్మాసం పూజలు

అమరావతి: వైష్ణవ ఆలయాలలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల రోజుల పాటు ప్రతిరోజూ గోదాదేవికి తిరుప్పావై పాశురాలను ప్రవచించి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించటం ధనుర్మాస విశిష్టతగా చెబుతారు. మండలంలోని వైకుంఠపురం, అమరావతి, కోదండరామాలయం, పాండురంగస్వామి ఆలయం, మల్లాది వటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ధనుర్మాస పూజలు నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- తుఫాన్‌తో నష్టపోయిన వరి పంట పరిశీలన
- రేపటిలోగా సర్వే పూర్తిచేయాలని ఆదేశం



వర్షాలకు దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో నీట మునిగిన వరి పంటను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం పరిశీలించారు. తుఫాన్ తీరం దాటి పది రోజులు గడుస్తున్నప్పటికీ వరద నీటిలోనే పొలాలు ఉన్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ అక్కడకు చేరుకున్నారు. గ్రామంలో 610 హెక్టార్లలో వరిపంట సాగు చేసిన విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అందులో 598 హెక్టార్లు తుఫాన్‌కు దెబ్బతిన్నాయని, 610 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని వ్యవసాయ శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు 362 హెక్టార్లలో సర్వే పూర్తయిందని వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయాల సిబ్బంది కలెక్టర్‌కు నివేదించారు. సమీపంలోని మురుగు కాల్వ నుంచి దిగువకు నీరు వెళ్లకపోవడంతోనే పంట పొలాలన్నీ నీట మునిగాయని కలెక్టర్‌కు తెలిపారు. కాల్వ ఆక్రమణకు గురి కావడం, పూడికతీత పనులు మరో కారణమని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండో పంట వేయడానికి అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మురిగిపోయిన వరి ఓదెలను కలెక్టర్ పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పంటల నష్టం అంచనాల సర్వే ఈనెల 18వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతుల జాబితాను తక్షణమే గ్రామ సచివాలయంలో ప్రదర్శించాలని అన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు కేంద్రాల పరిశీలన

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ శనివారం సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు కళాశాలలోని మూడు విభాగాలకు చెందిన భవనాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలు అనుసరించి అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండగా, ఒక్కొక్క నియోజకవర్గానికి నాలుగు గదులు అవసరమవుతాయని సూచించారు. ఎన్నికల సమయంలో ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్స్, కంట్రోల్ యూనిట్లు భద్రపరచడానికి 12 స్ట్రాంగ్ రూములు నిర్ణయించిన కొలతలతో ఉండేలా చూడాలన్నారు. అలాగే ఓట్ల లెక్కింపునకు మరో 12 గదులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు ఒకదానికొకటి సమీపంలోనే ఉండేలా చూడాలని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, ఆర్డీఓ జి.రవీందర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాస్, కరస్పాండెంట్ కొమ్మినేని పద్మహరిప్రసాద్, కార్యదర్శి మానం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రేంజ్ ఐజీ పాలరాజుకు గోల్డ్ మెడల్



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న ఐజీ పాలరాజు

నగరంపాలెం: అల్లర్లు సృష్టిస్తున్న సంఘ విద్రోహ శక్తులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంది. ఈ క్రమంలో రౌడీషీటర్లపై ఉన్న కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయించడం, వారికి శిక్షలు పడేలా చేయడం ద్వారా కటకటాలు లెక్కిస్తున్నారు. ఇక గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లోని రౌడీషీటర్ల ఏరివేతపై, ఇతరత్రా నేరాలకు సంబంధించి కేసుల్లోనూ ఐజీ పాలరాజు ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుకి గోల్డ్ మెడల్ దక్కింది. శనివారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదగా ఐజీ జి.పాలరాజు గోల్డ్‌మెడల్ అందుకున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు కూడా గోల్డ్‌మెడల్ దక్కగా, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గర్గే, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. ఐజీ పాలరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

బాపట్ల ఎస్పీకి డీజీపీ కమాండేషన్ గోల్డ్ మెడల్



ఎస్పీకి గోల్డ్‌డెస్క్ మెడల్‌ను అందజేస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

బాపట్లటౌన్: బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా డీజీపీ కమాండేషన్ గోల్డ్ డెస్క్ మెడల్‌ను శనివారం సాయంత్రం అందుకున్నారు. మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాద్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2022 సంవత్సరంలో జిల్లాలో దిశ, బెస్ట్ కన్విక్షన్ పోలీసింగ్, ముఖ్యమైన కేసులకు సంబంధించి దర్యాప్తు, కోర్టు షెడ్యూల్ మేరకు ట్రైల్ జరిపించి స్వయంగా కేసు పురోగతి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నేరస్తులకు శిక్ష పడే విధంగా తీసుకున్న చర్యలకు, రోడ్డు ప్రమాదాలను తగ్గించినందుకు, జిల్లాలో నాటుసారా, గంజాయి కట్టడికి, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకున్న చర్యలకుగాను ఈ అవార్డు అందుకున్నారు. బాపట్ల జిల్లా చుండూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఏఎస్ఐ రాజ్ కుమార్ నేర చేధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా బ్రాంజ్ మెడల్ అందుకున్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్‌కు జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జిపై కేసు నమోదు

- సొంత పార్టీ నాయకుడిపై దాడిచేసిన తండ్రీకొడుకులు
- డెకరేషన్..లైటింగ్ సొమ్ము అడిగినందుకే..
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు

బాపట్లటౌన్: తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, అతని తనయుడు రాకేష్ వర్మలపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల మండలం కంకటపాలెం గ్రామానికి చెందిన మద్దిబోయిన రాంబాబు 20 సంవత్సరాలుగా టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. 2019 ఎన్నికల్లో రాంబాబు తన తల్లి వెంకటరత్నంను బాపట్ల మండల జెడ్పీటీసీ సభ్యురాలిగా టీడీపీ తరపున పోటీ చేయించి ఆర్థికంగా నష్టపోయాడు. అయినప్పటికీ పార్టీపై ఉన్న మమకారంతో క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే గతేడాది డిసెంబరులో చంద్రబాబు నాయుడు బాపట్ల వచ్చిన సందర్భంగా స్టేజి, డెకరేషన్, లైటింగ్ వేసినందుకు, ఇటీవల బాపట్లలో నిర్వహించిన మినిమహానాడుకు స్టేజి, డెకరేషన్, లైటింగ్, ఈనెల 8న చంద్రబాబునాయుడు బాపట్ల వచ్చిన సందర్భంగా స్టేజి, డెకరేషన్, లైటింగ్ లాంటి కార్యక్రమాలు చేసినందుకుగానూ రూ.4.20 లక్షలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లించాల్సి ఉంది. నగదుకు సంబంధించిన బిల్లులు ఇటీవల నరేంద్రవర్మ పీఏకు అందజేశాడు. మూడు రోజుల కిందట వర్మ పీఏ ఫోన్ చేసి సార్ అమౌంట్ ఇచ్చేందుకు పార్టీ కార్యాలయానికి రమ్మంటున్నారని చెప్పడంతో పార్టీ కార్యాలయానికి వెళ్లాడు. వర్మతో మాట్లాడుతుండగా ఆయన తనయుడు రాకేష్‌వర్మ వచ్చి ఇష్టానుసారంగా బూతులు తిడుతూ దాడిచేశారు. ఇదేమని అడిగితే తండ్రి నరేంద్రవర్మ, తనయుడు రాకేష్‌వర్మలు ఇరువురు నోరెత్తావంటే చంపేస్తాం అంటూ బెదిరించారు. ఏం చేయాలో తెలియక పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ యు శ్రీనివాసులు వేగేశన నరేంద్రవర్మ, అతని కుమారుడు రాకేష్‌వర్మలపై హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాపు పురస్కారం దక్కడం అదృష్టం

సినీ యువ దర్శకుడు అనిల్ రావిపూడి



అనిల్ రావిపూడిని సత్కరించిన అతిథులు, సంస్థ నిర్వాహకులు

పాత గుంటూరు: గుంటూరు విద్యార్థినైన నాకు మహనీయులు బాపు, రమణ, బాలు పేరుతో పురస్కారం దక్కడం అదృష్టమని ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో బాపు, రమణ, బాలు కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం పద్మశ్రీ బాపు జయంతి, పలువురు ప్రముఖులకు బాపు స్మారక పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. డాక్టర్ రమణ యశస్వి సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా యువ దర్శకుడు అనిల్ రావిపూడి పాల్గొని మాట్లాడుతూ గుంటూరుతో ఎంతో అనుబంధం ఉందని, ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందన్నారు. కళాకారులను గుర్తించి పురస్కారాలు అందించిన సంస్థ సభ్యులను అభినందించారు. అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ప్రతిభతో తెలుగువారి గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసిన దర్శకుడు, చిత్రకారుడు, కార్టూనిస్టు బాపు అని కొనియాడారు. అనిల్ రావిపూడికి బాపు స్మారక దర్శక కేసరి పురస్కారం, ప్రసిద్ధ చిత్రకారులు చిదంబరం, రామశాస్త్రి, ప్రసిద్ధ కార్టూనిస్ట్ బొమ్మన్‌లకు బాపు స్మారక పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమాఖ్య ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ ఎస్.వి.కృష్ణారావు, పారిశ్రామికవేత్త కోటిరావు, కళాపీఠం కార్యదర్శి ప్రొఫెసర్ సుశీలమ్మ, నవమల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ పాల్గొన్నారు.

గ్రూప్ 1,2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెహ్రూనగర్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ 1, 2 ఉద్యోగాలకు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి మధుసూదనరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-2కు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, వంద మంది అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ నుంచి 50 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇస్తారని తెలిపారు. గ్రూప్-1 పరీక్షలకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు కోవాలన్నారు. 60 మంది అభ్యర్థులకు జనవరి 5 నుంచి 60 రోజులపాటు ఉచిత శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికపై అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు 10, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు(తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు మాత్రమే), ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసి గ్రూప్-2 అభ్యర్థులు ఈనెల 22లోగా, గ్రూప్-1 అభ్యర్థులు ఈనెల 31లోగా రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0863-2358071 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

పార్టీ నిర్ణయాన్ని స్వాగతించాలి

ఎంపీ మోపిదేవి

రేపల్లె: నియోజకవర్గ సమన్వయకర్త విషయంలో పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ స్వాగతించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు కోరారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో పట్టణ, మండలంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. పార్టీ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. 175 కి 175 స్థానాలు విజయమే లక్ష్యంగా సామాజిక సమీకరణాలను పాటిస్తూ పార్టీ అధిష్టానం అమలు చేస్తున్న నిర్ణయాలను నాయకులు, ప్రజాప్రతినిధులు గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. రేపల్లె నియోజకవర్గానికి పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థి విజయానికి అందరూ కలిసికట్టుగా శ్రమించాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడు మృతి

పర్చూరు(చినగంజాం): చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.... నెహ్రూ కాలనీకి చెందిన యువకుడు బేతా సుదర్శనరావు (18) మూడు రోజుల క్రితం ప్రార్థనకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి చేరలేదు. ఈక్రమంలో తన కుమారుడు కనబడటం లేదని తల్లి కోటేశ్వరమ్మ 14వ తేదీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని యువకుడి కోసం గాలింపు చేపట్టారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన కొందరు స్థానికులకు సుదర్శనరావు శవం నీటిపై తేలుతూ కనబడింది. దీంతో వారు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెరువు వద్దకు చేరుకున్న తల్లి కోటేశ్వరమ్మ, ఆమె పెద్దకుమారుడు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రవిశంకర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పంచాయతీ సిబ్బంది సహకారంతో శవాన్ని బయటికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంధన పొదుపుపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: జాతీయ ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా వాల్‌పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం బాపట్ల పట్టణంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు ప్రదర్శన చేపట్టారు. ఇంధన పొదుపు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈ జి.ఆంజనేయులు, అధికారులు సుబ్బారావు, బి.హరి ప్రసాద్ రావు, విజయ శ్రీనివాస్, ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

అండర్–17 క్రికెట్ జట్టుకు విద్యార్థుల ఎంపిక

పర్చూరు(చినగంజాం): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో స్థానిక శాతవాహన హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి అండర్–17 క్రికెట్ జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకట రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షేక్ మొహమ్మద్, అఖిల్, దుడ్డు ప్రేమ్ చరణ్, చల్లా ఇస్సాక్, బాణావత్ గణపతి నాయక్, చింతా స్టీఫెన్ పాల్ తోపాటు అండర్–14 విభాగంలో షేక్ ఖరుద్దీన్ ఖాన్, చల్లా జేమ్స్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. కోచ్‌గా వ్యవహరించిన తులసి శివ నాగేశ్వరరావుని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అనురంజని, ప్రిన్సిపాల్ కొప్పుల జాన్‌బోస్ పాల్గొన్నారు.



జాతీయ జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్

ఓటర్ల తుది జాబితా పారదర్శకంగా ఉండాలి

- 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే బ్యాలెట్
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్–2024 సంబంధించి జనవరిలో విడుదల కానున్న ఓటర్ల లిస్టు అత్యంత పారదర్శకంగా ఉండాలని, వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావుతో కలిసి నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల బృందం ఈ నెల 22, 23 తేదీల్లో ఓటర్ల లిస్టు, అమలు, క్లెయిమ్స్ పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష చేయనుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 ఏళ్లు దాటిన, విభిన్న ప్రతిభావంతులు కోరితే వారి ఇంటి వద్ద బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేయించాలన్నారు. దీనికి సంబంధించిన ఓటర్ల వివరాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఫోటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నెంబర్ లేకుండా పూర్తిస్థాయి సవరణకు చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్వోలు ఖచ్చితంగా వెళ్లాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ఆరోగ్యశ్రీలో ఉచితంగా బోధకాలుకు ఆపరేషన్

గుంటూరు మెడికల్: ఫైలేరియా సిస్ (బోధకాలు) సర్జరీలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రవేశపెట్టారని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్, గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ అన్నారు. విశాఖపట్నంలో ఈనెల 13 నుంచి 16 వరకు అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా 83వ జాతీయ సదస్సు జరిగింది. సదస్సుకు దేశ వ్యాప్తంగా ఐదు వేల మందికి పైగా వైద్యులు హాజరయ్యారు. సదస్సులో డాక్టర్ సుమిత శంకర్ ఎలిఫెంటియాసిస్‌పై కేస్‌స్టడీ వివరించారు. అత్యాధునిక చికిత్సలు నేడు బోధకాలు నివారణకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ చికిత్స ద్వారా భారీ ఏనుగు కాళ్ల లాంటి కాళ్లు ఉన్న రోగులకు వెలుగునివ్వచ్చునన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత భాగాలలో క్యాన్సర్ కోసం ద్వైపాక్షిక ఇంగువినల్ బ్లాక్ డిసెక్షన్ విధానం మెరుగైన ఫలితాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. నెగెటివ్ ప్రెజర్ కంప్రెసివ్ థెరపీ, లింఫో–లిపోసక్షన్‌లో ఉపయోగించడం గురించి వివరించారు. వీటి ద్వారా ఆపరేషన్ల సమయంలో రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉండదని, తక్కువ రక్తం బయటకు పోతుందన్నారు. నూతన వైద్య విధానాలను ఆరోగ్యశ్రీలో చేర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆధునిక చికిత్సలతో గుంటూరు జీజీహెచ్‌లో తక్కువ సమయంలో ఎక్కువ మందికి ఆపరేషన్లు చేసి వారి నడకకు చేయూతనిచ్చామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి శస్త్రచికిత్సలకు సుమారు రూ. 5 లక్షలు తీసుకుంటారని వెల్లడించారు. డాక్టర్ సుమిత శంకర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ పరిశీలకులుగా సదస్సుకు హాజరై మాట్లాడారు.

కేఎల్‌యూలో టెక్‌ఎక్స్‌పో

సందర్శించిన ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్

తాడేపల్లిరూరల్: స్థానిక వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో టెక్ ఎక్స్‌పో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ మాట్లాడుతూ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు తాము రూపొందించిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారని, డ్రైవర్ లేకుండా నడిచే కారు, ఆటోమేటిక్‌గా ఓపెన్ అయ్యే డోర్, ఎదురుగా ఉన్న వాహనాన్ని గుర్తించి తన వేగాన్ని స్వయంగా నియంత్రించుకునే కారు ఇలా అనేక రకాలైన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారని తెలిపారు. రానున్న కాలంలో టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కనుందనే సంకేతాలు ఇవ్వడమే కాకుండా వాటిని నేరుగా తయారుచేసి చూపించారని విద్యార్థులను ప్రశంసించారు. రాడార్ టెక్నాలజీని, మెటల్ డిక్టేటర్‌ను అనుసంధానం చేసి దూరంగా ఉన్న వస్తువులను ఏ దిక్కున ఉన్నాయో కూడా గుర్తించగలిగే పరికరాలతో పాటు మనుషులు దగ్గరకు రాగానే తలుపులు తెరుచుకునే యంత్రం వంటి టెక్నాలజీలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎఫ్ఇడీ డిప్యూటీ కో ఆర్డినేటర్ డాక్టర్ సోమ్‌లాల్ మాట్లాడుతూ మొదటి సంవత్సరంలోనే టెక్నాలజీ పట్ల అభిరుచిని పెంచుకున్న విద్యార్థులు రానున్న మూడు సంవత్సరాల్లో మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటారని అన్నారు. అనంతరం అత్యాధునిక టెక్నాలజీని రూపొందించడంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్.ఇ.డి. డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఎఫ్ఇడీ డిప్యూటీ కో ఆర్డినేటర్ డాక్టర్ సోమ్‌లాల్, కో ఆర్డినేటర్లు డాక్టర్ శివగంగ ప్రసాద్, డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



డ్రైవర్ లేకుండా నడిచే కారు నమూనా పరిశీలిస్తున్న ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్

ఘనంగా శ్రీ విద్యా వస్త్రాలయం 8వ వార్షికోత్సవం



వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

పాత గుంటూరు: గుంటూరు బ్రాడీపేట 4/2లోని ప్రముఖ వస్త్ర సంస్థ ''శ్రీ విద్యా'' వస్త్రాలయం 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కాంజీవరం పట్టు, డిజైనర్ శారీస్, తుషార్, బెనారస్ హ్యాండ్లూమ్స్, సూట్స్, సల్వార్ సూట్స్, కుర్తీస్, కంచిపట్టు చీరలు, కాటన్ శారీస్, ఉప్పాడ చీరలు, డ్రస్ మెటీరియల్స్, లేహంగాస్, క్రాప్ టాప్, వెస్ట్రన్ వేర్, అనేక వస్త్రాలు నూతన డిజైన్లలో సరికొత్త స్టాక్ అందుబాటులో ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. అన్ని రకాల వస్త్రాలపై పరిమిత కాలంలో 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు కస్టమర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా వినూత్న వస్త్రశ్రేణిపై ప్రత్యేక డిస్కౌంట్స్ ఇస్తున్నట్లు ఓం ప్రకాష్ తెలిపారు.